గుంతలు మాత్రమే పూడ్చుతున్నారు

- రహదారులకు మహర్దశ అంటూ కూటమి నేతల ప్రచారం
- అధికారంలోకి వచ్చాక నిర్మాణాలు విస్మరిస్తున్న వైనం
- జగన్ పాలనలో రోడ్ల నిర్వహణపై దుష్ప్రచారం



మరమ్మతుకు నోచుకోని వెదురుమూడి-అంగర రహదారి



మరమ్మతులతో సరిపెట్టిన వెదురుమూడి - మండపేట రహదారి

కపిలేశ్వరపురం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో ప్రజలకు ముందుగా ప్రకటించిన సంక్షేమ క్యాలెండర్ ప్రకారం ఆర్థిక సాయం ఠంచనుగా అందేది. రైతులు విద్యార్థులు, మహిళలు, చేనేత కార్మికులు, చేతి వృత్తిదారులు, ఇలా అన్ని వర్గాల వారు క్యాలెండర్‌లో ప్రకటించిన తేదీ నాటికి సాయాన్ని అందుకునేవారు. ప్రపంచాన్ని కకలావికలం చేసిన కరోనా వంటి రోజుల్లో సైతం ఏ వర్గానికీ సంక్షేమాన్ని ఆపలేని ప్రభుత్వం వైఎస్ జగన్ ప్రభుత్వానిది. అంతటి సంక్షేమ ప్రభుత్వం ఆర్థిక సమస్యలతో రహదారుల నిర్మాణం కాస్త ఆలస్యమైంది. అయినప్పటికీ గుంతలను పూడ్చి అవస్థలను తీర్చింది. వైఎస్ జగన్ పాలనలో సంక్షేమానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను పక్కదారి పట్టించేందుకు అప్పటి ప్రతిపక్ష కూటమి నేతలు రహదారులు అధ్వానమంటూ తీవ్రమైన దుష్ప్రచారం చేశారు. తాము అధికారంలోకి వస్తే రహదారులను పూర్తి స్థాయిలో నిర్మిస్తామంటూ ప్రచారాన్ని ఊదరగొట్టారు. కారణాలేమైనా కూటమి ప్రభుత్వం వచ్చింది. అర్ధ సంవత్సరం పూర్తికావస్తున్నప్పటికీ రహదారుల నిర్మాణాలను పూర్తి చేయలేదు. గుంతలను మాత్రమే పూడ్చుతున్నారు.

మహర్దశ అంటూ ప్రచార బాకా

కూటమి ప్రభుత్వం రాగానే రాష్ట్రంలో రహదారులకు మహర్దశ పడుతుందంటూ ప్రతిపక్షంలో ఉన్నపుడు కూటమి నేతలు ప్రచారం ఊదర గొట్టారు. ప్రస్తుతం ఆ హామీని విస్మరిస్తూ గుంతలను మాత్రమే పూడ్చే కార్యక్రమం చేపడుతున్నారు. ఈపాటిదానికి అంత ప్రచార ఆర్భాటాలెందుకంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు. గుంతలు పూడ్చడానికి మాత్రమే నిధులను కేటాయిస్తూ మొత్తం రహదారుల నిర్మాణానికి నిధులు వెచ్చించినంత హడావుడి చేస్తున్నారు. అరకొర నిధులతో చేపట్ట దలచిన గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ఈ నెల రెండో తేదీన మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ప్రారంభించారు. రెండు వారాలు పైబడినప్పటికీ అనేక గ్రామాల్లో గుంతలు పూడ్చే పనులు పూర్తికాలేదు.

అరకొర నిధుల కేటాయింపు

కూటమి ప్రభుత్వం రహదారుల నిర్మాణ ఆవశ్యకతను విస్మరించి కేవలం గుంతలను పూడ్చేందుకు మాత్రమే నిధులు కేటాయించింది. మండపేట నియోజకవర్గంలో మొత్తం 19 మరమ్మతులకు కేవలం రూ.4.30 కోట్లు మాత్రమే కేటాయించారు. అందులో భాగంగా తాపేశ్వరం, మండపేట, రామచంద్రపురం మీదుగా వెళ్లే ద్వారపూడి-యానాం రహదారి మరమ్మతులకు రూ.20 లక్షలు, మండపేట- జొన్నాడ రహదారి మరమ్మతులకు రూ.60 లక్షలు, పామర్రు-ఉట్రుమిల్లికి రూ.30 లక్షలు, రాజమహేంద్రవరం-కేశవరం వయా పుణ్యక్షేత్రం రహదారికి రూ.12 లక్షలు, రాయవరం మండలం సోమేశ్వరం-రాజానగరం రోడ్డుకు రూ.20 లక్షలు, ఏడిద- ఏడిద సీతానగరం రహదారికి రూ.10 లక్షలు, ద్వారపూడి రహదారికి రూ.10 లక్షలు, జెడ్.మేడపాడు, జీఎస్‌టీ రహదారికి రూ.8 లక్షలు, వల్లూరు-బంగారయ్యపేట వయా నిడసనమెట్ట రోడ్డుకు రూ.25 లక్షలు, మండపేట -కపిలేశ్వరపురం రోడ్డుకు రూ.8 లక్షలు, కాకినాడ -రాజమహేంద్రవరం వయా ద్వారపూడికి రూ.30 లక్షలు, ఇప్పనపాడు-మెర్నిపాడుకి రూ.40 లక్షలు, వెదురుమూడి - అంగరకు రూ10 లక్షలు, బలభద్రపురం-ద్వారపూడి వయా వేములపల్లికి రూ.30 లక్షలు, మండపేట-కపిలేశ్వరపురంకి రూ.40లక్షలు, మండపేట-దుళ్ళ వయా ఏడిద రహదారికి రూ40లక్షలు, కూర్మాపురం-మండపేట వయా చెల్లూరుకి రూ.10 లక్షలు, తాపేశ్వరం-వెగలతోడు వయా పేకేటి పాకలుకి రూ.15 లక్షలను మాత్రమే నిధులను కేటాయించారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో 21 మరమ్మతు పనులు చేపట్టేందుకు కేవలం రూ.5.83 కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ నిధులు రహదారుల నిర్మాణానికి ఏమాత్రమూ సరిపోవు. గుంతలు పూడికలో సైతం నాణ్యత ప్రశ్నార్థకమే.

గుంతలు పూడ్చితే సరిపోదు



లోతైన గుంతలతో ఆరు నెలలుగా నరకయాతన చూశాం. ఇప్పుడైనా రహదారి నిర్మాణాలు చేపడతారనుకున్నాం. తీరా చూస్తే కేవలం గుంతలను మాత్రమే పూడ్చుతున్నారు. మళ్లీ గుంతలు పడే అవకాశాలు సహజంగా వెంటనే వస్తుంది. రహదారులను పూర్తి స్థాయిలో నిర్మించాలి.

– యరమాటి వెంకన్నబాబు, మండపేట

కపిలేశ్వరపురం రోడ్డును విస్తరించాలి



మండపేట-కపిలేశ్వరపురం రహదారి విస్తరణ పేరుతో గతంలో రూ.16 కోట్లతో పనులు చేస్తున్నామన్నారు. తీరా అంగర గ్రామ శివారు వరకూ మాత్రమే రహదారిని విస్తరింపజేశారు. మండల కేంద్రమైన కపిలేశ్వరపురం రహదారి విస్తరణకు నోచుకోలేదు. ప్రభుత్వాధినేతలు స్పందించి రహదారి విస్తరణ పనులు చేపట్టాలి.

– పీతల బంగారం, కపిలేశ్వరపురం

క్లుప్తంగా

పడి తొక్కిన అయ్యప్ప మాలధారులు



దీపారాధనలో పడితొక్కు పూజ చేస్తున్న మాలధారులు

కపిలేశ్వరపురం: అంగరకు చెందిన అయ్యప్ప మాలధారులు సోమవారం రాత్రి పడి తొక్కుతూ గ్రామంలో ఊరేగారు. దీపారాధనలో భాగంగా స్వామిని కీర్తిస్తూ భక్తిగీతాలు ఆలపించారు. చిన్నారులు అయ్యప్ప వేషధారణలో అలరించారు. గురు స్వామి బరిశెట్టి శ్రీను అయ్యప్ప మాలధారులచే విశేష పూజలు చేయించారు.

తక్కువ ఖర్చుతో పోషకాహారం తయారీ

కాజులూరు: మహిళలు తమకు అందుబాటులో దొరికే మొక్కలు, ఆకుకూరలను ఉపయోగించి తక్కువ ఖర్చుతోనే పోషకాహారం తయారు చేసుకోవచ్చని గొల్లపాలెం అలయన్స్ క్లబ్ అధ్యక్షురాలు, స్థానిక ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరిదేవి అన్నారు. మంగళవారం గ్రామంలో గర్భిణులు, బాలికలకు క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో ఆరోగ్య నియమాలు, పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో కొందరు మహిళలు పోషకాహారమంటే ఖరీదుతో కూడుకున్న విషయమని భ్రమ పడుతున్నారన్నారు. తక్కువ ఖర్చుతో ఏఏ కాయకూరలు, ఆకుకూరలతో ఏఏ పోషకాహారం తయారు చేసుకోవచ్చో మహిళలకు తెలియజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు వీరవల్లి గణపతి, గణేశ్‌కుమార్, దుర్గారాజశేఖర్‌రెడ్డి, విజయలక్ష్మి, అంజి పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

మండపేట: భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏఐసీసీ సభ్యుడు కామన ప్రభాకరరావు ఆదేశాల మేరకు ఆ పార్టీ నాయకులు స్థానిక రాజారత్న జంక్షన్ వద్ద గల ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొండ దుర్గారావు, మగ్గం జాకబ్ రాజబాబు, ముగ్గుళ్ల శ్రీను, పిల్లి అప్పన్న, కుచ్చు బాబీ, ఓసూరి శ్రీనివాస్, చక్రి, తాటికొండ కృష్ణ, సతీష్, దుళ్ళ శ్రీను, గుత్తుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంరక్షణపై అవగాహన

మండపేట: మహిళా సంరక్షణపై కేశవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు చదువులు పూర్తయి లక్ష్యానికి చేరువయ్యేంత వరకూ చదువుపైనే దృష్టి సారించాలని ముఖ్య అతిథిగా హాజరైన మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు అన్నారు. బలమైన సంకల్పంతో పనిచేస్తేనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు వెళ్లగలుగుతారని ఆయన అన్నారు. పాఠశాలలకు వెళ్లే సమయంలో ఈవ్ టీజింగ్‌లకు ఎవరైనా పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తే వారి తాట తీస్తామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ , ఉమెన్ ట్రాఫికింగ్, కుటుంబంలో మహిళల ప్రాధాన్యం, చదువులు, ఉద్యోగం వంటి పలు సామాజిక అంశాలపై ఆయన ప్రసంగించారు. మండపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ అప్పారావు, మహిళా కానిస్టేబుల్, కేశవరం ద్వారపూడి మహిళా పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వనసమారాధన

రామచంద్రపురం: పట్టణంలో కామాక్షి దుర్గా కార్పెంటర్స్ (వడ్రంగి) అసోసియేషన్ కార్తిక వన సమారాధన మంగళవారం సంఘ అధ్యక్షుడు అప్పారి శ్రీనివాస్, సంఘ సభ్యుల ఆధ్వర్యంలో కార్తిక వనమహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత ఉసిరిచెట్టు పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి సంఘ సభ్యులు పాల్గొన్నారు. రామచంద్రపురం కార్పెంటర్ సంఘ అధ్యక్షులు అప్పారి శ్రీనివాస్ మాట్లాడుతూ వనభోజ కార్యక్రమాల ద్వారా కుటుంబ సంప్రదాయాలు, సంఘం సభ్యుల కలయికలు, వారి సంప్రదాయ, సనాతన ధర్మాల విలువలు తెలుస్తాయని, భావితరాలకు ఈ సంప్రదాయాలు అలవాటుగా మారతాయన్నారు. కార్పెంటర్ కార్మికులకు 50 సంవత్సరాలకే పింఛన్ అందించాలని, కార్పెంటర్ సంఘాలకు భవన నిర్మాణాలు సమకూర్చాలని వంటి సమస్యలపై ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో గానాల సత్యసాయి, రామోజీ శ్రీనివాస్, ధర్మాసనం రామకృష్ణ, వాసంశెట్టి రాంప్రసాద్, అంగర జగదీష్, దంగేటి రామకృష్ణ, గున్నేపల్లి భీమశంకరం, కొనుకు వెంకటేశ్వరరావు, పితాని బేబీరావు, వాసంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంగరలో..

కపిలేశ్వరపురం: మహిళల ఆధ్వర్యంలో అంగరలో మంగళవారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. గ్రామంలోని వరాలపేట, మార్కెట్ సెంటర్‌కు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఆట పాటలతో సరదాగా గడిపారు. కార్తిక ప్రాశస్త్యాన్ని వివరిస్తూ ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. చిన్నారులకు ప్రతిభా పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు.

పాఠశాలల్లో ఆధార్ కేంద్రాల ఏర్పాటు

కె.గంగవరం: మండలంలో విద్యార్థుల అపార్ సంఖ్య నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్ సూచించారు. మండలంలోని దంగేరు, పామర్రు, కె.గంగవరం గ్రామాల్లో పర్యటించిన ఎంపీడీఓ ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులను అపార్ నమోదు ప్రక్రియకు అడ్డంకిగా ఉంటున్న చిన్నారుల ఆధార్ నమోదు చేయించడానికి ఆయా పాఠశాలల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సముదాయ చైర్మన్లు పీవీ బ్రహ్మానందం, మేడిశెట్టి పుల్లయ్య, ఓవీ రమణ, రవి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం



అగ్నిప్రమాద బాధితులకు సాయం చేస్తున్న స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

రాయవరం: చెల్లూరు పంచాయతీ పరిధిలో జరిగిన అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సహకారాన్ని అందజేసింది. ఆ గ్రామంలోని అంబేడ్కర్ నగర్లో ఆదివారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో యాళ్ల సత్యనారాయణ, యాళ్ల సుందరరావు కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. వీరికి స్నేహ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో 100 కేజీల బియ్యం, రూ.4 వేల విలువ జేసే కూరగాయలు, నిత్యావసరాలు, రూ.1,500 విలువ చేసే దుప్పట్లు, టవల్స్ తదితర సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో స్నేహ స్వచ్ఛంద సేవ సంస్థ సభ్యులు డి.ఆదిలక్ష్మి, పి.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ముగ్గుల పోటీలు



కపిలేశ్వరపురం గ్రంథాలయం వద్ద ముగ్గులకు రంగులు అద్దుతున్న విద్యార్థినులు



మండపేటలో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విద్యార్థినులు

కపిలేశ్వరపురం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కపిలేశ్వరపురం గ్రంథాలయంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి దానేటి శివకుమారి ఆధ్వర్యంలో జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించగా గ్రామంలోని సుమారు 40 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. సృజనాత్మకంగా వేసిన ముగ్గుల్లో ఇందిరా గాంధీ విశేషంగా ఆకర్షించింది. విజేతలకు నేడు నిర్వహించే వారోత్సవాల ముగింపు సందర్భంగా బహుమతులను అందజేయనున్నట్టు గ్రంథాలయాధికారి తెలిపారు.

మండపేట: స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి ఎస్.పూర్ణమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళారం ఆటల పోటీలు నిర్వహించారు. ఏడిద రోడ్డులోని ఎస్‌వీఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించారు. తొలుత భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయురాలు సునీత విద్యార్థుల చేత గ్రంథాలయ వారోత్సవాల ప్రతిజ్ఞ చేయించారు. మహిళా చట్టాలు, మహిళల హక్కులు- బాధ్యతల తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. 50 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నట్టు ఎస్ పూర్ణమ్మ తెలిపారు.

104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



కపిలేశ్వరపురం ఎంపీటీసీ సభ్యుడికి వినతిపత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

కపిలేశ్వరపురం: ప్రభుత్వం ద్వారా తమ సమస్యలు పరిష్కారం అయ్యేలా సహకరించాలని కోరుతూ 104 సిబ్బంది ఆందోళనబాట పట్టారు. ఇందులో భాగంగా మంగళవారం ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ కపిలేశ్వరపురం ఎంపీటీసీ సభ్యుడు శీలం భాస్కరరావుకు 104 యూనియన్ నాయకులు కె.సాయి ప్రసాద్, కె.లోవరాజు వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ 104 సర్వీసులను గతంలో మాదిరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలన్నారు. దీనివల్ల ప్రభుత్వానికి నిర్వహణ ఖర్చు తగ్గుతుందన్నారు. 2020లో విధుల్లోకి చేరిన సిబ్బందికి జీఓ నంబర్ -7 ప్రకారం వేతనాలను చెల్లించాలన్నారు. మూడేళ్లగా పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లను ఏరియర్స్ రూపంలో చెల్లించాలన్నారు.

మరుగుదొడ్ల ప్రాధాన్యంపై అవగాహన పెంచుకోవాలి



కె.గంగవరంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

కె.గంగవరం: మండలంలోని కె.గంగవరం జెడ్పీ హైస్కూల్‌లో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ మరుగుదొడ్ల ప్రాధాన్యతను తెలుసుకోవాలని వివరించారు. గతంలో బహిరంగ మలవిసర్జన జరిగేదన్నారు. అప్పుడు అంటువ్యాధులు ప్రబలి ప్రాణాలు పోతుండేవన్నారు. ఆ క్రమంలో ప్రభుత్వాలు మరుగుదొడ్లపై ప్రజలకు అవగాహన పెంపొందింపజేసి ప్రతి ఇంటిలో మరుగుదొడ్ల ఏర్పాటు చేసుకునేలా తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయని తెలిపారు. విద్యార్థులు మరుగుదొడ్ల ఆవశ్యకత, ఉపయోగించుకునే విధానాలు తెలుసుకుని తమ ఇళ్లల్లో పెద్దలను చైతన్యం చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులకు మరుగుదొడ్లకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీవీ బ్రహ్మానందం, ఈఓపీఆర్డీ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టాయిలెట్స్ దినోత్సవం

రాయవరం: ప్రపంచ టాయిలెట్స్ దినోత్సవాన్ని మంగళవారం రాయవరంలో నిర్వహించారు. మరుగుదొడ్ల వినియోగంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పంచాయతీ విస్తరణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. వచ్చే నెల 12 వరకూ గ్రామాల్లో ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఏవో వైఎస్ఎన్ గోపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ డి.చైతన్యకుమారి, పీఆర్ ఏఈ వి.రామనారాయణ, ఎంఈవో-2 వై.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



టాయిలెట్స్ డే నిర్వహిస్తున్న రాయవరం మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది



రామచంద్రపురంలో పోస్టర్ ఆవిష్కరణ

రామచంద్రపురంలో పోస్టర్ ఆవిష్కరణ

రామచంద్రపురం రూరల్: జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ రావిరాల సూచన మేరకు ఈ నెల 19 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకూ నిర్వహించనున్న పారిశుధ్యం-మరుగుదొడ్డి వినియోగంపై అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేయాలని రామచంద్రపురం ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ ఆధ్వర్యంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం పురస్కరించుకుని పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఈ కార్యక్రమాలను విజయవంతం చేసి ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎస్.సెలత్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్థివ శివలింగాలకు అభిషేకాలు



పసలపూడిలో పార్థివ శివ లింగాల గ్రామోత్సవం



పార్థివ శివలింగాలకు పూజలు చేస్తున్న అర్చకులు

రాయవరం: భక్తుల శివ నామస్మరణ నడుమ పసలపూడిలో మంగళవారం పార్థివ శివ లింగాలకు వైభవంగా అభిషేకాలు నిర్వహించారు. కార్తిక మాసం, ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని గ్రామంలోని మాణిక్యాంబ సమేత రాజరాజేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శివస్వామి చింతా సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించారు. పుట్టమట్టితో చేసిన 108 పార్థివ శివ లింగాలకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అర్చకులు పరిటాల శ్రీనివాస్, పరిటాల కేదార్, మాధవభట్ల కృష్ణమూర్తి అర్చకత్వంలో సాంబమూర్తి శివస్వామి పర్యవేక్షణలో శివ లింగాలకు అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం పార్థివ లింగాలకు గ్రామోత్సవం నిర్వహించి జల నిమజ్జనం చేశారు. సాయంత్రం స్వామివారి శాంతి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా సుబ్బారెడ్డి సౌజన్యంతో భారీగా అన్న సమారాధన చేశారు. పప్పురెడ్డి గురుస్వామి, జిల్లాలోని వివిధ ప్రాంతాల శివ స్వాములు పాల్గొన్నారు.

సోమేశ్వరునికి లక్ష పత్రి పూజ

వెంటూరు గ్రామంలోని పార్వతీ సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం లక్ష పత్రి పూజ నిర్వహించారు. కార్తిక మాసం, ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారికి లక్షపత్రి పూజ, అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు చేశారు. కొండేపూడి వెంకట సూర్యనారాయణమూర్తి కుటుంబ సభ్యుల సౌజన్యంతో నిర్వహించిన లక్షపత్రి పూజలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అగస్త్యేశ్వరస్వామి సన్నిధిలో గణపతి హోమం

కపిలేశ్వరపురం: స్థానిక అగస్త్యేశ్వర పాప వినాసేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అంగరకు చెందిన కొండేపూడి కనకరాజు దంపతులతో వేద పండితులు వై.కిరణ్ శర్మ తదితరులు గణపతి హోమం చేయించారు. గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు. కార్తిక పూజలో భాగంగా దేవతామూర్తులను విశేషంగా అలంకరించారు.

ఘనంగా కార్తిక మాసోత్సవాలు

కాజులూరు: కార్తిక మాసం పురస్కరించుకుని గొల్లపాలెంలో మంగళవారం మహాశివునికి రుద్రాభిషేకం, కుంకుమార్చనలు ఘనంగా జరిగాయి. స్థానిక నాయకుడు డాక్టర్ చుండ్రు వీర్రాజుచౌదరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో ప్రముఖ వేదపండితులు బాదంపూడి నాగవెంకటసుబ్రహ్మణ్యం (పండుస్వామి), సతీష్‌స్వాములు 15 మంది పురోహితులతో మహా శివునికి రుద్రాభిషేకం నిర్వహించారు. కాశి రుద్రాక్షలు, విభూది, చందనం, 100 రకాల పండ్ల రసాలతో స్వామిని అభిషేకించి సుమారు మూడువేల మంది మహిళలతో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన సుమారు 8 వేల మంది భక్తులు పూజల్లో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

వైభవంగా కార్తిక దీపారాధన



ద్రాక్షారామ శుక్రవారపుపేట రామాలయం వద్ద కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామలోని శుక్రవారపుపేటలో వేంచేసిన కోదండరాముని ఆలయంలో ఏటా నిర్వహిస్తున్న విధంగా కార్తికమాసం మూడవ మంగళవారం నిర్వహించే కార్తిక దీపారాధన ఈ ఏడాది దేశంశెట్టి రాజబాబు, మాధవరపు కాశీవిశ్వనాథం, వడగన గంగాధరంల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దీపాలను మహిళలు, పెద్దలు, చిన్నారులు భక్తిశ్రద్ధలతో వెలిగించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 10 అడుగుల ఎత్తైన శివలింగం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ద్రాక్షారామ, పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వెంటూరులో సోమేశ్వరస్వామికి లక్షపత్రి పూజ



కపిలేశ్వరపురం అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



గొల్లపాలెంలో స్వామివారికి పండ్ల రసాలతో అభిషేకం



గొల్లపాలెంలో అమ్మవారికి మహిళల కుంకుమార్చన